**నేటి కందం- నేటికి అందం**

పలు ప్రత్యేకతలు గలిగి
కల దీపిక యగుచు కోటి కాంతులు జిమ్మన్
తుల నెరుగని గతి-నౌకా
బలమును బెంచంగ హర్షవర్ధను జేరెన్ !!
(10-6-1972 హర్షవర్ధన్ నౌక భారత నౌకాదళం లో చేరిన రోజు)
-రాధశ్రీ
సెల్:9494481210





# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com



**చురక**

ప్రజలకది కల్పతరువే
పంటలేల ఎండిపాయె
కాళేశ్వరం కుంగిపోయి
కన్నీరేలా నిండిపాయె
అద్భుతంగా కీర్తిస్తూ
అందంగా చూపించినా
కనిపించే తప్పులనది
కళ్లుగట్టి ఆపించునా
-వేల్పుల నారాయణ
9440433475





హైదరాబాద్ మంగళవారం 10-6-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:237 పేజీలు:6 వెల: రూ.1/-


# సీఎంను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్, జూన్ 9:రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని రాష్ట్ర మంత్రి మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఇవాళ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి కలిశారు.

ఈ సందర్భంగా శాలువాతో ముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా మీ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. మంత్రివర్గంలో తనకు అవకాశం ఇచ్చినందుకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మంత్రి సతీమణి లలితతో పాటు కుమారులున్నారు.

# బస్ పాస్ ఛార్జీలు పెంచిన ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 9: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల బస్‌పాస్ ఛార్జీలు పెరిగాయి. సాధారణ ప్రజలతో పాటు స్టూడెంట్ బస్ పాస్ ధరలను కూడా టీజీఆర్‌టీసీ పెంచింది. పెంచిన బస్ పాస్ ధరలు తక్షణం అమల్లోకి రానున్నాయి. 20 శాతానికి పైగా బస్ పాస్ రేట్లు పెరిగాయి. రూ. 1150 ఉన్న ఆర్డినరీ పాస్ ధర రూ. 1400కు పెంపు, రూ. 1300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ రూ. 1600, రూ. 1450 ఉన్న మెట్రో డీలక్స్ పాస్ రూ. 1800కు పెంచారు.

## విద్యార్థులకు కొత్త బస్ పాస్‌లకు గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలో ఈ నెల 12న విద్యాసంస్థలు తెరవనున్న క్రమంలో విద్యార్థులకు కొత్తగా బస్సు పాస్‌లకు టీజీ ఆర్టీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యార్థులకు ఈ నెల 12 నుంచి కొత్త బస్ పాసుల ను జారీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. కొత్త బస్ పాస్ ల కోసం www.tgsrtc.telangana.gov.in/bus-pass-services yîuÙ సైట్లో అప్లై చేసుకోవాలని అధికారులు సూచించారు.గ్రేటర్‌లో 40 కేంద్రాల ద్వారా పాస్‌లు నగర వ్యాప్తంగా 40 ఆర్టీసీ కేంద్రాల్లో విద్యార్థులు ఈ బస్ పాస్‌లను పొందవచ్చని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది.

అనంతరం అప్లికేషన్ ఫామ్‌ను తీసుకెళ్లి విద్యార్థులకు దగ్గరలో ఉన్న బస్ పాస్ కౌంటర్లలో ఇస్తే.. స్టూడెంట్ బస్ పాస్ జారీ అందజేస్తారని.. ఆర్టీసీ అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం ఉన్నందున విద్యార్థినులు బస్ పాస్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

# సీఎం రేవంత్‌కు మంత్రి అడ్లూరి కృతజ్ఞతలు



హైదరాబాద్, జూన్ 9:తెలంగాణ రాష్ట్రం మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం సీఎం కలిసి పుష్ప గుచ్చం అందించి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలియజేశారు. మాదిగ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించారని, ప్రాణం ఉన్నంతవరకు కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని తెలిపారు.

# దెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో డిప్యూటీ మేయర్ ఆకస్మిక తనిఖీలు



హైదరాబాద్, జూన్ 9:ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్ తార్నాక చౌరస్తాలోని డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కుళ్లిపోయిన చికెన్‌తో బిర్యానీ వండుతున్నారన్న ఫిర్యాదులపై స్పందించిన ఆమె.. రెస్టారెంట్‌లో సోదాలు చేశారు. తనిఖీల సందర్భంగా కుళ్లిన, నాణ్యతలేని ఆహార పదార్థాలను రెస్టారెంట్‌లో గుర్తించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమానిపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు.

సంబంధిత ఫుడ్‌సేఫ్టీ అధికారులతో మాట్లాడిన డిప్యూటీ మేయర్. రెస్టారెంట్‌లో స్వాధీనం చేసుకున్న ఆహార పదార్థాలకు పరీక్షలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆహార నాణ్యత పాటించని అన్ని హోటల్స్, రెస్టారెంట్స్‌పై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా నగర ప్రజల ఆరోగ్యం, భద్రతను కాపాడటంలో కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు తగిన నిబంధనలు పాటించకపోతే చట్టపర మైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నగరంలోని అన్ని రెస్టారెంట్లు, హోటల్స్, టిఫిన్ సెంటర్లలో ఫుడ్ సేఫ్టీని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

ఈ చర్యలు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలో కీలకమని అభిప్రాయపడ్డారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా : చలమల్ల కృష్ణారెడ్డి

నల్గొండ, జూన్ 9: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుజ్జ గ్రామానికి చెందిన ఎర్ర పరమేశ్ సోమవారం మృతి చెందాడు. విషయం తెలిసిన చలమల్ల కృష్ణారెడ్డి పరమేశ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్ర పరమేశ్ పిల్లల బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని, వారిని ఉన్నత చదువులు చదివిస్తానని, రూ.1 లక్ష ఆర్థిక సాయం అందిసానని తెలిపారు. తక్షణ సాయంగా రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

# రోడ్డు నిబంధనలు పాటించకుంటే కేసులు తప్పవు : సీఐ వెంకట రాజగౌడ్

మెదక్, జూన్ 9: వాహనాలు నడిపించే ప్రతీ ఒక్కరూ రోడ్డు నిబంధనలు కచ్చితంగా పాటించాలని లేకుంటే జరిమానాలు, కేసులు తప్పవని రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్ అన్నారు. సోమవారం రామాయంపేట జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసి వాహన డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

వాహనం నడిపించే ప్రతి ఒక్కరూ తమ వాహనానికి సంబంధించిన కాగితాలు, డ్రైవింగ్ లైసెన్సులు కచ్చితంగా వెంటే పెట్టుకోవాలన్నారు. బైకులు నడిపిస్తే హెల్మెట్, ఫోర్ వీలర్స్‌కు సీట్ బెల్టు తప్పనిసరిగా ఉండాలన్నారు. అంతేగాకుండా ఆటోలు నడిపించే వారు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. వాహనాలను ఎక్కువ స్పీడ్‌గా నడిపించి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దన్నారు.ఎక్కువ శాతం ప్రమాదాలు మద్యం తాగడం వల్ల జరుగుతున్నాయని డ్రైవింగ్ చేసే ముందు మద్యం ముట్టవద్దన్నారు. మద్యం వల్ల విలువైన ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. తన ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా జాగ్రత్తగా గమ్యస్తానానికి వెళ్లాలన్నారు. సీఐ వెంట రామాయంపేట ఎస్సై బాలరాజు తదితర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# రాగల నాలుగురోజులు తెలంగాణలో ఈదురుగాలులతో వర్షాలు

హైదరాబాద్ జూన్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో రాగల నాలుగురోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలుంటాయని చెప్పింది. వాయువ్య ఉత్తరప్రదేశ్ పరిసర ప్రాంతాల నుంచి మధ్యప్రదేశ్, విదర్భ మీదుగా తెలంగాణ వరకు నగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని పేర్కొంది. ఉత్తర తమిళనాడు నుంచి దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు ఇంటీరియర్ కర్నాటక మీదుగా సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని పేర్కొంది.

# మాగంటి గోపీనాథ్ మృతి చాలా బాధాకరం.. తలసాని



హైదరాబాద్, జూన్ 9: మాగంటి గోపీనాథ్ మృతి చాలా బాధాకరం అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం మాదాపూర్ లోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ నివాసానికి మాజీ హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి వెళ్ళి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోపీనాథ్ సతీమణి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం సానుభూతి తెలిపారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాటాడుతూ 1992 నుండి మాగంటి గోపీనాథ్, తాను ఒక సోదరుడిగా, మంచి మిత్రులుగా కలిసి రాజకీయాల్లో ఉన్నామని గుర్తు చేసుకున్నారు. గత నెల 26వ తేదీన తాను కుటుంబ సభ్యులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటన కు వెళ్ళామని, వెళ్ళే ముందు కూడా తాము కలుసుకున్నామని వివరించారు. ఇంతలోనే ఇలా జరిగిందని పేర్కొన్నారు.గోపీనాథ్ మృతి వార్త తనను తీవ్రగ్భ్రాంతికి గురి చేసిందని చెప్పారు. భౌతికంగా గోపీనాథ్ దూరమైనప్పటికీ మూడు పర్యాయాలు ఎమ్మెల్యే గా జూబ్లీహిల్స్ నియోజకవ ర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు కూడా ధైర్యంగా ఉండాలని కోరారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ వెంట మలక్ పేట నియోజ కవర్గ ఇంచార్జి ఆజాం, అమీర్ పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హన్మం తరావు, నాయకులు నామన సంతోష్ కుమార్, అశోక్ యాదవ్, శ్రీహరి, ఆరీఫ్, హరిసింగ్, నారాయణ రాజు, తదితరులున్నారు.

# కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు.. వైభవంగా గోవిందుడి రథోత్సవం



తిరుపతి, జూన్ 9: తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవం కర్ణాల వీధి, బేరి వీధి, గాంధీరోడ్డు మీదుగా తిరిగి ఆలయ రథమండపానికి చేరుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు గోవిందనామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. భక్తులు అడుగడుగునా టెంకాయలు కొట్టి స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు.

శ్రీదేవి భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి, నమ్మాళ్వార్ల వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. రథోత్సవంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజి, ఎస్ ఇ-2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఈవో శాంతి, ఇతర ఇంజినీరింగ్ వలుశాఖల అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

నల్గొండ, జూన్ 9: నార్కట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో చేపట్టిన బిల్లులను అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్ సోమవారం తనిఖీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మండల వ్యాప్తంగా 154 పనులు చేపట్టారు. రూ.4 కోట్ల 10 లక్షలు ఖర్చు చేశారు. రూ.21 లక్షల సామగ్రి కొనుగోలు చేశారు. సామాజిక బృందం వారు 10 రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ఉపాది పనుల అమలు తీరుపై సమీక్షించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఉపాది పనులను సక్రమంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకూడదని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీవీఓ వేణుగోపాల్, ఏవీఓ గౌతమి, ఎంపీడీఓ ఉమేశ్, ఎంపీఓ సుధాకర్, ఏపీఓ యాదయ్య, పంచాయితీ కార్యదర్శులు, క్లస్టర్లు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



సూర్యాపేట, జూన్ 09 : ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అందుకు అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నాలుమూలల నుంచి వచ్చిన 64 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడమే ఉద్యోగుల బాధ్యత అన్నారు. అధికారులు నిత్యం వారికి అందుబాటులో ఉండి పని చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి విధులు, రిజిస్టర్ల నిర్వహణ, ఫైల్స్ సరైన పద్ధతిలో నిర్వహించేందుకు దిశా నిర్ధేశం చేయాలని చెప్పారు. భూ సమస్యలకి సంబంధించిన దరఖాస్తులు సమర్పించేందుకు జిల్లా స్థాయి ప్రజావాణికి రావాల్సిన అవసరం లేదని తెలిపారు. జూన్ 20 వరకు ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులచే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. భూ సమస్యలు ఏమైన ఉంటే ఆయా గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల్లో అన్ని డాక్యూమెంట్స్ జత చేసి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ అప్పారావు, డీఈఓ అశోక్, డీపీఓ యాదగిరి,, సీపీఓ కిషన్, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీసీఓ పద్మ, డీఏఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.







# ఇంకు పెన్ను అంతరించి బాల్‌పాయింట్ పెన్ అవతరించే !

## (10 జూన్ "జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినోత్సవం" సందర్భంగా)

రాయడానికి అందుబాటులో ఉన్న ఏకైక ఉత్తమ సాధనం "బాల్‌పాయింట్" పెన్ లేదా "బాల్ పెన్" అని మనకు తెలుసు. చిన్నారి నుంచి పండు ముసలి వరకు అందరి హస్త భూషణం బాల్ పెన్. బాల్ పెన్‌ను చూడని, స్పర్శించని వారు ఉంచారా ! విద్యా బోధన, విద్యావంతుల జేబు భూషణం, వ్యాపార గణాంకాల పునాది, సమాచార వితరణశీలి పెన్ను మాత్రమే. నేడు ప్రపంచవ్యాప్తంగా పెన్ను అంటేనే బాల్‌పాయింట్ పెన్ అనేది నిర్వివాదాంశం. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా మన ఇంటి నేస్తం అయ్యింది బాల్ పెన్ను. గతంలో ఇంకులో ముంచి రాసుకునే పన్నులు, సిరా నింపి రాసుకునే పన్నులను చూసాం. నేడు ఇంకా పెన్ను అంతరించిపోయింది. బాల్‌పాయింట్ పెన్ను మన నిత్య నేస్తం అయ్యింది.

జాతీయ బాల్‌పాయించ్ పెన్ దినోత్సవం:

1888లో జాన్ లావుడ్ అనే శాస్త్రవేత్త ఇంకు పెన్నును కనుగొనడం జరిగింది. ఇంకు పెన్ను వాడుకలో వచ్చిన అసౌకర్యాల వల్ల మరో మెరుగైన పెన్ను అవసరం ఏర్పడింది. 1938లో "లాజ్లో బిరో" అనే హంగేరియన్ జర్నలిస్టు బాల్‌పాయింట్ పెన్నులు తెలిసాయి రూపొందించడం, తర్వాత 10 జూన్ 1943న తన సోదరుడు ఇంజనీర్ "జియార్జీ బిరో"తో కలిసి బాల్పాయింట్ పెన్నును పెటెంట్ చేయడం జరిగింది. ఈ పరమ అద్భుత ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏట 10 జూన్‌న ప్రపంచ దేశాలు "జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినోత్సవం (నేషనల్ బాల్‌పాయింట్ పెన్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినం వేదికగా పెన్నులు కృతజ్ఞతలు తెలపడం, వివిధ రకాల పెన్నుల ప్రదర్శనలు, పెన్నులను అలంకరించి కృతజ్ఞతలు తెలపడం, పెన్‌తో మన ఆప్తులకు ఉత్తరం రాయడం, పెన్ను ప్రాధాన్యాన్ని గూర్చి వ్యాసం రాయడం, బాల్ పెన్ ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

నాటి నుంచి నేటి వరకు విద్యాలయాలు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, కార్యాలయాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, అన్ని వర్గాల ప్రజలు/యువా/పిల్లలకు ఆత్మీయ నేస్తంగా, గౌరవాన్ని పెంచే చవకైన సాధనంగా, జేబుకు అలంకారంగా బాల్‌పాయింట్ పెన్ను అపార అద్వితీయ సేవలను అందిస్తున్నది.

బాల్‌పాటింట్ పెన్ సాధనంగా విద్యా బోధనలు, సాంస్కృతిక వికాసం, ఆర్థిక వ్యవస్థలు, సగటు మనిషి జీవనశైలిలో ఓ అవిభాజ్య భాగం అయ్యింది. ఒక్క బాల్‌పాయింట్ పెన్‌తో దాదాపు 50,000 పదాలు రాస్తూ 100 పేజీల వరకు రాయవచ్చు. ప్రతి ఒక్కరు సాలీనా సగటున 4.3 బాల్ పెన్నులను వాడడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు 125 బాల్ పెన్నుల అమ్మకాలు జరుగుతున్నాయి. పలు రకాల బ్రాండ్లు, అద్భుత ఆకృతులు, ఆకర్షణీయ కళా సంపదలతో బాల్ పెన్నులు మనకు అందుబాటులో ఉన్నాయి. తరగతి గది గుండెకాయ బాల్ పెన్ అని తెలుసుకోవాలి. అందరికీ చవకగా అందుబాటులో ఉన్న బాల్‌పాయింట్ పెన్నులు నమ్మకమైన, నాణ్యమైన, మృదు రాతల ధారలు పారిస్తున్నాయి. తేలికగా పేపరుపై పారడం, సులభంగా ఆరిపోవడం, అందమైన రాతలకు వారధిగా కావడం బాల్ పెన్ను ప్రత్యేకతలుగా పేర్కొనాలి.

ఆకర్షణీయమైన రంగులు, వివిధ కాళాకృతులతో నేడు బాల్ పెన్నులు పిల్లలు/యువతలో చదుకోవాలనే, రాయాలనే ఉత్సుకతను ప్రేరేపిస్తున్నాయి. నేడు అందమైన బాల్‌పాయింట్ పెన్నులు వ్యక్తుల స్థాయిని, వ్యక్తిత్వాలను చెప్పకనే చెబుతున్నాయి. మన జేబులో చేరిన పెన్ను మన హృదయ ఉపరితలంపై నాట్యమాడుతూ మనకు సమోన్నత గౌరవాన్ని ఆర్జించి పెడుతున్నాయి. మన జీవితంలో ఒక విడదీయరాని భాగమైన బాల్‌పాయింట్ పెన్నులను పూజాగదిలో ఇష్టదైవం ముందు పెట్టి మనకు విజ్ఞాన వివేకాలను అందించమని వేడుకుందాం. మన బాల్‌పాయింట్ పెన్నుకు శతకోటి వందనాలు అర్పిద్దాం, సన్మార్గంలో నడిచే ధైర్యాన్ని ఇవ్వమని వేడుకుందాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# నక్సలిజం ముప్పు నుంచి భారత్‌ను విముక్తి చేయడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది: శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, జూన్ 9:ఇటీవల నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో కీలక పాత్ర పోషించిన అధికారులను కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి శ్రీ అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో కలిశారు. ఈ ఆపరేషన్లలో చరిత్రాత్మక విజయం సాధించినందుకు వారిని అభినందించారు. నక్సలిజం ముప్పు నుంచి భారత్‌ను విముక్తి చేయడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

'ఎక్స్' వేదికగా ఆయన ఇలా పేర్కొన్నారు... "ఇటీవల జరిగిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లలో కీలక పాత్ర పోషించిన అధికారులను కలిశాను. ఈ ఆపరేషన్లలో చరిత్రాత్మక విజయం సాధించిన సందర్భంగా వారిని అభినందించాను. ఈ ఆపరేషన్లను ధైర్యసాహసాలతో విజయవంతం చేసిన సాహసోపేత జవాన్లను కలవడానికి నేను ఆసక్తిగా ఉన్నాను. త్వరలోనే వారిని కలవడానికి ఛత్తీస్‌గఢ్ వెళతాను. నక్సలిజం ముప్పు నుంచి భారత్‌ను విముక్తి చేయడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది."

కేంద్ర హోం, సహకార మంత్రి మార్గదర్శకత్వంలో, భద్రతా దళాలు ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ ప్రయత్నాల్లో భాగంగా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు (నారాయణపూర్, దంతేవాడ, కొండగావ్, బీజాపూర్ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ యూనిట్లతో సహా) 18.05.2025 నుంచి 21.05.2025 వరకు అబుజ్మద్‌లోని మారుమూల ప్రాంతాల్లో ఒక ఆపరేషన్ నిర్వహించారు. 21.05.2025న, బోటర్ గ్రామ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది నక్సల్స్ హతమయ్యారు. మృతుల్లో సీపీఐ (మావోయిస్ట్) ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు బసవరాజు అలియాస్ గగన్న కూడా ఉన్నారు. ఈ సందర్భంగా పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారుల్లో ఛత్తీస్‌గఢ్ డీజీపీ శ్రీ అరుణ్ దేవ్ గౌతమ్, అదనపు డీజీ (యాంటీ-నక్సల్ ఆపరేషన్స్/ఎస్ఐబీ/ఎస్‌టీఎఫ్) శ్రీ వివేకానంద్, ఐజీ (బస్తర్ రేంజ్) శ్రీ సుందర్‌రాజ్, సూపరింటెండెంట్ (నారాయణ్‌పూర్) శ్రీ ప్రభాత్ కుమార్, సూపరింటెండెంట్ (బీజాపూర్) శ్రీ జితేంద్ర యాదవ్, సూపరింటెండెంట్ (నక్సల్ రహిత బస్తర్ జిల్లా) శ్రీ శలభ్ సింగ్‌లను కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి శ్రీ విష్ణు దేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి శ్రీ విజయ్ కుమార్ శర్మ, కేంద్ర హోం శాఖ కార్యదర్శి శ్రీ గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ శ్రీ తపన్ డేకా సహా పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# విధుల్లో చేరిన రేంజర్ లక్ష్మీనారాయణ..

ఆదిలాబాద్, జూన్ 9:మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజనల్ పరిధిలోని జన్నారం రేంజ్ ఆఫీసర్ గా లక్ష్మీనారాయణ సోమవారం మధ్యాహ్నం కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ కార్యాలయంలో విధుల్లో చేరారు. లక్ష్మీనారాయణ గతంలో ఇక్కడ ఆరు నెలలు రేంజు ఆఫీసరుగా పనిచేసి సెలవుపై వెళ్లారు.

ఆ తర్వాత ఇంచార్జి రేంజు ఆఫీసర్ గా ఇందనపల్లి రేంజ్ ఆఫీసర్ హాఫీజోద్దీన్ వ్యవహరించారు.

ఆ తర్వాత లక్ష్మీనారాయణ మళ్లీ విధుల్లో చేరి, ఆ తర్వాత సెలవుపై వెళ్లి గ్రూప్ -1 ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యారు. ఈ తరుణంలో తాళ్లపేట రేంజ్ ఆఫీసర్, జన్నారం ఇన్చార్జి వి.సుష్మా రావు ఇంతకాలం జన్నారం ఇన్చార్జి బాధ్యతలను నిర్వర్తించారు. గ్రూప్ -1 లో ఉద్యోగం రాకపోవడంతో మళ్లీ గతంలో ఉన్న జన్నారం రేంజ్ ఆఫీసర్ పోస్టింగ్ లోనే లక్ష్మీనారాయణ చేరాలనుకున్నారు.

ఈ మేరకు కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ కార్యాలయంలో సీసీఎఫ్ ప్రభాకర్ ను కలిసి మధ్యాహ్నం విధుల్లో చేరారు. రెండు రోజుల్లో జన్నారం రేంజ్ లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# రైతు సంక్షేమం దిశగా మా ప్రయత్నాలు రాబోయే కాలంలో పెద్ద ఎత్తున కొనసాగుతాయి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 9:గత 11 సంవత్సరాలుగా ప్రభుత్వం తీసుకున్న రైతు అనుకూల నిర్ణయాలు అనేక సత్ఫలితాలను అందించాయని చెబుతూ, వ్యవసాయదారుల గౌరవం, అభ్యున్నతి పరంగా కీలక మార్పులు వచ్చినట్లు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వెల్లడించారు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ ఫసల్ బీమా వంటి కీలక కార్యక్రమాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న ముఖ్యమైన చర్యలుగా వీటిని అభివర్ణించారు.

కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ) నిరంతరం పెరుగుతుండటం వల్ల, దేశంలోని ఆహార ఉత్పత్తిదారులు తమ పంటలకు న్యాయమైన ధరలను పొందడమే కాకుండా, వారి ఆదాయం కూడా పెరుగుతోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

దేశంలోని కష్టపడి పనిచేసే రైతులకు సేవ చేయడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవమని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. గత 11 సంవత్సరాల కాలాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు రైతుల సంక్షేమాన్ని పెంచడమే కాకుండా వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు దోహదం చేశాయన్నారు.

నేల ఆరోగ్యం, నీటిపారుదల వంటి కీలక అంశాలపై ప్రభుత్వం శ్రద్ధ వహించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు నెరవేరాయని ప్రధానమంత్రి తెలిపారు.

రైతు సంక్షేమం కోసం మా ప్రయత్నాలు రాబోయే కాలంలో మరింత భారీస్థాయిలో కొనసాగుతాయని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. మన రైతుల గౌరవం, శ్రేయస్సు కోసమే ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

"మన కర్షక సోదర సోదరీమణులు గతంలో చిన్న అవసరాలకు కూడా అప్పులు చేయవలసి వచ్చేది. కానీ గత 11 సంవత్సరాల్లో మన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా వారి జీవితాలు చాలా సులభతరం అయ్యాయి. వారి సంక్షేమం కోసం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ ఫసల్ బీమా వంటి అనేక ముఖ్యమైన చర్యలు మేం చేపట్టాం. ఇప్పుడు ఎమ్ఎస్‌పీ నిరంతర పెరుగుదలతో, దేశంలోని ఆహార ఉత్పత్తిదారులు తమ పంటలకు న్యాయమైన ధరను పొందడమే కాకుండా, వారి ఆదాయం కూడా పెరుగుతోంది.

# ముందుచూపుతో కూడిన క్రియాశీల విధానాన్ని తీసుకుంది: డాక్టర్ పీ.కే. మిశ్రా

న్యూఢిల్లీ, జూన్ 9:ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీ.కే. మిశ్రా ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఇచ్చిన పిలుపును సమర్థిస్తూ తీవ్రమైన వేడి వాతావరణాన్ని ప్రపంచ సంక్షోభంగా భావించి, ఆ సమస్యను పరిష్కరించాల్సిన తక్షణ అవసరం ఉందన్నారు. నిన్న (2025 జూన్ 06) జెనీవాలో జరిగిన తీవ్ర వేడి ప్రమాద నిర్వహణ (ఎక్స్‌ట్రీమ్ హీట్ రిస్క్ గవర్నెన్స్)పై జరిగిన ప్రత్యేక సెషన్‌లో కోలకోపన్యాసం చేశారు. పెరుగుతోన్న ఉష్ణోగ్రతలు ప్రజారోగ్యం, ఆర్థిక స్థిరత్వం, పర్యావరణ ధృడత్వానికి ముప్పుగా మారాయని చెప్పారు. తీవ్ర వేడి వాతావరణ నిర్వహణ విషయంలో ఉమ్మడిగా నేర్చుకునేందుకు, మార్గదర్శకత్వం వహించటం, భాగస్వామ్యాల కోసం ఫ్రేమ్‌వర్క్‌ను ఒక సంయుక్త వేదికగా ఏర్పాటు చేయాలన్న యూఎన్‌డీఆర్ఆర్ ఆలోచనను స్వాగతిస్తున్నట్లు భారత్ తెలిపింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో తీవ్ర వేడి వాతావరణ ప్రమాద నిర్వహణకు ముందుచూపుతో కూడిన క్రియాశీల విధానాన్ని భారత్ తీసుకుందని డాక్టర్ మిశ్రా ప్రధానంగా చెప్పారు. భారతదేశం విపత్తులకు స్పందించే విధానాన్ని దాటి సమగ్ర సంసిద్ధత, ఉపశమన వ్యూహాల దిశగా ప్రయాణం సాగించిందని అన్నారు. 2016 నుంచి జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) వేడిగాలుల నిర్వహణపై సమగ్రంగా జాతీయ స్థాయిలో మార్గదర్శకాలను తయారు చేసి 2019లో సవరించింది. ఇది వేడి విషయంలో కార్యాచరణ ప్రణాళికల (హెచ్ఏపీ-హీట్ యాక్షన్ ప్లాన్)ను వికేంద్రీకరించారు. ముందస్తు హెచ్చరికలు, వివిధ సంస్థల మధ్య సమన్వయం, ప్రజలను భాగస్వామ్యం చేయటం ద్వారా ప్రాణాలను కాపాడటాన్ని తెలియజేసే అహ్మదాబాద్ వేడి వాతావరణ కార్యాచరణ ప్రణాళికను ఆ సందర్భంగా ప్రస్తావించారు.

"23 వేడి వాతావరణం ఉండే రాష్ట్రాలలో 250 కి పైగా నగరాలు, జిల్లాలు ఎన్‌డీఎంఏ నలహా, సాంకేతికత, సంస్థాగత యంత్రాంగాల మద్దతుతో పనిచేసే కార్యాచరణ ప్రణాళికలను కలిగి ఉన్నాయి'' అని డాక్టర్ మిశ్రా ప్రధానంగా చెప్పారు. నిఘాను బలోపేతం చేయటం, ఆసుపత్రులను సంసిద్ధంగా ఉంచటం, అవగాహనను పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా వేడిగాలుల విషయంలో మరణాలు గణనీయంగా తగ్గాయన్నారు.

మొత్తం ప్రభుత్వం, ప్రజలందరినీ.. ఆరోగ్యం, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, కార్మిక, విద్యుత్, జల, విద్య, మౌలిక సదుపాయాలకు సంబంధించిన మంత్రిత్వ శాఖలను నిమగ్నం చేసే విధానాన్ని భారత్ అనుసరిస్తోందని ప్రధానంగా చెప్పారు. వేడి వాతవరణం విషయంలో కార్యాచరణ ప్రణాళికలను మెరుగుపరచడంలో స్థానిక ప్రభుత్వాలకు సహాయసహకారాలు అందించటంలో ప్రజారోగ్య సంస్థలు, పరిశోధనా బృందాలు, పౌర సమాజ సంస్థలు, విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

"తీవ్రమైన వేడి వివిధ వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఈ విషయంలో స్పందించేందుకు సంప్రదాయ విజ్ఞానానికి స్థానిక అనుభావాలను జోడించింది" అని డాక్టర్ మిశ్రా ప్రధానంగా చెప్పారు. పాఠశాలలు... మార్పునకు ఉత్ప్రేరకాలుగా మారాయని, వాతావరణం గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తున్నాయని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా, ప్రభావవంతంగా స్పందించేందుకు ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలని వివరించారు.

సంసిద్ధంగా ఉండటం అనే విధానం నుంచి భారతదేశం.. చలువ పైకప్పు సాంకేతికలు, పరోక్ష కూలింగ్ కేంద్రాలు, పట్టణాల్లో హరిత ప్రాంతాలను పెంచటం, సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణతో సహా దీర్ఘకాలిక వ్యూహాల ద్వారా వేడిగాలుల తీవ్రత తగ్గించే విధానానికి మారిందని తెలిపారు. అర్బన్ హీట్ ఐలాండ్ (యూహెచ్ఐ) అంచనాలను నగర ప్రణాళికలకు భారత్ అనుసంధానిస్తోందని పేర్కొన్నారు.

విధానపరమైన మార్పును సూచిస్తూ... జాతీయ, రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులను(ఎస్‌డీఎంఎఫ్) ఇప్పుడు వేడి గాలుల తగ్గింపు కోసం ఉపయోగించొచ్చని తెలిపారు. ఇది స్థానిక ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వ్యక్తులకు నివారణ, ఉపశమన ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేసేందుకు వీలు కల్పిస్తుందని, తద్వారా సంయుక్తంగా బాధ్యత తీసుకోవటం పెరుగుతుందని అన్నారు.

ఇంకా ఉన్న కీలక సవాళ్లను గుర్తించాలని డాక్టర్ మిశ్రా కోరారు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మెరుగుపరచడానికి, భవన నిర్మాణ సాంకేతికతలను మరింత అభివృద్ధి చేయడం, అందుబాటు ధరల్లో సాంస్కృతికంగా ఇబ్బందిలేని కూలింగ్ వ్యవస్థల్ని అభివృద్ధి చేయాలన్నారు. మహిళలు, ఆరుబయట పనిచేసే కార్మికులు, వృద్ధులు, చిన్న పిల్లలను వేడిగాలులు కలిగించే ప్రభావాలు వేర్వేరుగా ఉన్నందున ఈ సమస్యల్ని పరిష్కరించేందుకు రియల్-టైమ్ డేటా ఆధారంగా స్థానికీకరించిన వేడి-తేమ సూచికను (హీట్ హ్యుమిడిటీ ఇండెక్స్)ను అభివృద్ధి చేయడంపై ప్రపంచం దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.

"వేడిగాలులకు సరిహద్దులు ఉండవు. అందరినీ ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా జనసాంద్రత కలిగిన పట్టణ ప్రాంతాల్లో వీటి ప్రమాదం ఎక్కువ" అని డాక్టర్ మిశ్రా వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ధృడంగా నిలబడేందుకు అంతర్జాతీయ సమాజం సాంకేతిక సహకారం, వివరాలను పంచుకోవటం, ఉమ్మడి పరిశోధనలను పెంచాలని కోరారు. సంస్థాగత, ఆర్థిక సహాయ విధానాలతో పాటు విజ్ఞానాన్ని అందుబాటులో ఉంచటం, పరిశోధన, ఆచరణాత్మక పరిష్కారాలను అందించేందుకు ఉమ్మడి ఫ్రేమ్‌వర్క్‌ను తయారు చేయాలని అన్నారు.

తీవ్ర వేడి విషయంలో ప్రపంచం ముందుచూపు, సమన్వయంతో గట్టిగా స్పందించేందుకు భారతదేశం తన నైపుణ్యం.. సాంకేతిక, సంస్థాగత సామర్థ్యాలను ఇతరులతో పంచుకునే విషయంలో పూర్తి నిబద్ధతతో ఉన్నట్లు డాక్టర్ మిశ్రా పునరుద్ఘాటించారు.

# మంత్రి పదవి ఇవ్వడానికి ఇందూరు నేతలకు అర్హత లేదా : దినేష్ పటేల్ కులాచారి

నిజామాబాద్, జూన్ 9: మంత్రి పదవి ఇవ్వడానికి ఇందూరు నేతలకు అర్హత లేదా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణ లో నిజామాబాద్ జిల్లాకు కనీసం ఒక్క మంత్రి పదవి కూడా కేటాయించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది సాదా విషయమేం కాదన్నారు.




సోమవారం నిజామాబాద్ బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ నిజామాబాదు జిల్లాకు చెందిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ గౌడ్, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కూడా గౌరవించని కాంగ్రెస్, తన పార్టీ నేతల పట్లే చులకన చూపుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి జిల్లాల ప్రాతినిధ్యం పట్ల పట్టుదల లేదన్నారు. ఇది నైతికంగా, ప్రజాస్వామ్య పరంగా బాధాకరమన్నారు. నిజామాబాద్ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి.. ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సుడిగాలి పర్యటన తప్ప అభివృద్ధిపై శ్రద్ధ లేదన్నారు.

ప్రజలు కాంగ్రెస్ పార్టీకి సరైన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో బీసీలకు మేమే పెద్దపీట అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 56శాతం ఉన్నా బీసీలకు మీ మంత్రి వర్గంలో ఎంత మందికి పదవులు ఇచ్చారో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. బీసీల ఓట్లు కావాలి.. కానీ బీసీలకు పదువులు ఇవ్వరా అని అన్నారు. బీసీలను విస్మరించిన కాంగ్రెస్ ను రాబోయే రోజుల్లో బొంద పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకార్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మి నారాయణ, ఇంటలెక్చువల్ కన్వీనర్ డా:కొండా ఆశన్న, రూరల్ కన్వీనర్ పద్మ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు నాగరాజ్, ఓం సింగ్, నాయిడి రాజన్న, యాదల నరేష్, అమందు విజయ్ కృష్ణ, చిరంజీవి, సందీప్ పాల్గొన్నారు.

# ప్రభాకర్ రావు మామూలోడు కాదు : బండి సంజయ్

కరీంనగర్, జూన్ 9:ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మామూలోడు కాదని కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూప్రభాకర్ రావు మాలాంటి అనేక మంది కార్యకర్తల ఉసురుపోసుకున్నాడన్నారు. అమెరికాలోనే ప్రభాకర్ రావుకు కేసీఆర్ కుటుంబంతో కౌన్సెలింగ్ తంతు పూర్తయ్యిందని, పథకం ప్రకారమే లొంగిపోయి విచారణకు హాజరయ్యారన్నారు. విచారణలో



ప్రభాకర్ రావు ఇచ్చిన స్టేట్ మెంట్ ను బహిరంగ వర్చాలని, ఎందుకంటే సీఎం రేవంత్ రెడ్డిపైనే కాదు.. తనతో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు, జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసిన ఘనుడు అన్నారు. ప్రభాకర్ రావు వల్ల అనేక మంది జీవితాలు నాశనమయ్యాయని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.

భార్యాభర్తలు మాట్లాడుకున్న సంభాషణలను కూడా ట్యాప్ చేసిన నీచుడని, ఆయన వల్ల భార్యాభర్తలు ఫోన్ లో మాట్లాడుకోలేని దుస్థితిని కల్పించారన్నారు.

ఎవరి ఆదేశం మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారో ప్రజలకు తెలియాలన్నారు.

ఫోన్ ట్యాపింగ్ చేశాక వాటిని ఏం చేశారు.. ట్యాపింగ్ ఆడియోలను ఎవరికి పంపారని, ఆ ఆడియోలను అడ్డు పెట్టుకుని ఎవరెవరిని బెదిరించారు.. కోర్టు నిబంధనలకు లోబడే ప్రభాకర్ రావుపై సీరియస్ గా చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని, 18నెలల పాలనలో ఏ ఒక్క అవినీతి కేసులో విచారణ కూడా ముందుకు సాగలేదన్నారు.

ఇకనైనా కోర్టులో గట్టిగా వాదనలు వినిపించాలని, ప్రభాకర్ రావుతో సహా ఆయన వెనుకున్న సూత్రధారులను దోషులుగా తేల్చాల్సిందేనన్నారు.


## అందరికీ ఆత్మీయ ఆహ్వానం




నైజీరియన్ - అమెరికన్ రచయిత్రి
చిమమండా న్గోజి అడిచె
"ఫెమినిస్ట్ మేనిఫెస్టో - ప్రసంగాలు"
పి. సత్యవతి తెలుగు అనువాదం
పరిచయ కార్యక్రమం

తేది : 15 జూన్, 2025
సమయం : సా॥ 6 గ॥లకు
స్థలం : నాగాల్యాండ్స్, సీతారామపురం, విజయవాడ.

ఆత్మీయ వక్తలు : నండూరి రాజగోపాల్ గారు
బండ్ల మాధవరావు గారు
జి. లక్ష్మి గారు
వి. ప్రతిమ గారు
కొండవీటి సత్యవతి గారు
ఆత్మీయ స్పందన : పి. సత్యవతి గారు

★ సాహితీ స్నేహ బృందం, విజయవాడ
★ రుద్రమ ప్రచురణలు, వరంగల్లు


# పెట్రోల్ పోసి విద్యార్థిని దారుణ హత్య

అమరావతి, జూన్ 9:అనంతపురంజిల్లాలో దారుణం జరిగింది. ఇంటర్ సెకండియర్ విద్యార్థిని దారుణంగా హత్య చేశారు గుర్తు తెలియని దుండగులు. విద్యార్థినిపై పెట్రోల్ పోసి కాల్చి కిరాతకంగా చంపారు..

అనంతరం మృతదేహాన్ని మణిపాల్ స్కూల్ 'వెనక పడేశారు ఆగంతకులు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు.విద్యార్థిని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు.

కాగా గత మంగళవారం నుంచి తమ కూతురు కనిపించడం లేదని పోలీసులకు బాధిత యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కంప్లైంట్ చేసిన పోలీసులు పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు పట్టించుకుంటే తమ కూతురు దక్కేదని మృతురాలి తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. యువతిని కిరాతకంగా హత్య చేసిన దుండగుల కోసం వేట కొనసాగిస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# చెరువులో ఈతకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు మృతి



అమరావతి, జూన్ 9: చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటన అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండలం గుంటసీమ పంచాయతీ కేంద్రంలో చోటు చేసుకుంది. జంగమయ్య ఆలయానికి ఎదురుగా ఉన్న చెరువులో ఈతకు దిగి వీరు మృతి చెందారు.

మృతులను గుంటసీమ పంచాయతీ గంగవలస గ్రామానికి చెందిన కొర్ర సుశాంత్, కోతంగి పంచాయతీ బిల్లాపుట్ గ్రామానికి చెందిన గుంట భానుతేజ, సాయికిరణ్‌గా గుర్తించారు. భానుతేజ, సాయికిరణ్ వారం క్రితమే మేనమామ ఇంటికి వచ్చారు. ఈలోపు స్నేహితుడితో కలిసి సరదాగా చెరువులో ఈతకు దిగి మృతి చెందారు.

# అశ్రునయనాల మధ్య మైలారపు అడెల్లు అంతిమ వీడ్కోలు



ఆదిలాబాద్, జూన్ 9:చత్తీస్ ఘడ్ నేషనల్ పార్క్ ఏరియాలో ఎన్ కౌంటర్ లో మృతిచెందిన మావో యిస్టు అగ్రనేత మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ అంత్యక్రియలు సోమవారం ఆదిలాబాద్ జిల్లా పొచ్చెర లో జరిగాయి. 35ఏళ్ల సాయుధ బాట అనంతరం పోలీసుల కాల్పుల్లో నేలకొరిగిన అడెల్లు మృతదేహాన్ని కడసారి చూసేందుకు వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది హాజరై నివాళులర్పించారు. పీడిత వర్గాల కోసం మూడున్నర దశాబ్దాల కిందట అడవి బాట పట్టి రగల్ జెండాతో ఉద్యమంలో ఉన్నత స్థాయికి ఎదిగిన అడెల్లు అలియాస్ భాస్కర్ విగతజీవిగా ఇంటికి తిరిగి రావడంపై గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల రోధనలకు అంతులేకుండా పోయింది. అరుణోదయ తార అడెల్లు నింగికేగడం ఊహించలేకపోయామని మావోయిస్టు బంధుమిత్రుల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఎర్ర జెండాలు చేత పట్టుకుని, మైలారపు అడెల్లు అమర్ హై అంటూ వేలాదిమంది దారి పొడుగునా నినదించారు.

కగార్ ఆపరేషన్ ఆపివేయాల్సిందే..

బూటకపు ఎన్ కౌంటర్ల పేరిట బహుజన విప్లవకారులను అంతమొం దించడానికే కగార్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారని బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. అడెల్లు భౌతిక కాయాన్ని సందర్శించి ఎమ్మెల్యే నివాళులర్పించారు. వారి కుటుంబా నికి అండగా ఉంటానని భరోసా కల్పించి ఓదార్చారు. తెలంగాణ మావోయిస్టు ఉద్యమకారులను మట్టు పెట్టడమే లక్ష్యంగా సాగుతున్న కగార్ ఆపరేషన్ నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని విప్లవ రచయితల సంఘం, పౌర హక్కుల సంఘం, మావోయిస్టు బంధుమిత్రుల కమిటీ ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అంతిమయాత్ర లో అరుణోదయ కళాకారులు డప్పు చప్పులతో విప్లవ గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. మూడు గంటల పాటు సాగిన అంతిమయాత్రలో సుమారు 3వేల మంది హాజరు కావడం గమనార్హం. అంతిమ యాత్రలో సికాస మాజీ సీఈవో సుధాకర్ అలియాస్ ఉషన్న, పౌర హక్కుల సంఘం నేతలు గడ్డం లక్ష్మణ్, నారాయణ కుమారస్వామి, తుడుం దెబ్బ నాయకులు గణేష్, రేణుక, మావోయిస్టు మాజీ ఉద్యమ నేతలు మురళి అజయ్ అశోక్ జ్యోతి, జయ, శ్రీకాంత్, విరసం నేత పాణి, సిపిఐ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మావోయిస్టు బంధుమిత్రుల కమిటీ నేతలు పద్మకుమారి, పాల్గొన్నారు.

# పెట్రోల్ పోసి విద్యార్థిని దారుణ హత్య

అనంతపురం జూన్ 9:జిల్లాలో దారుణం జరిగింది. ఇంటర్ సెకండియర్ విద్యార్థిని దారుణంగా హత్య చేశారు గుర్తు తెలియని దుండగులు. విద్యార్థినిపై పెట్రోల్ పోసి కాల్చి కిరాతకంగా చంపారు..

అనంతరం మృతదేహాన్ని మణిపాల్ స్కూల్ 'వెనక పడేశారు ఆగంతకులు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు.విద్యార్థిని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాగా గత మంగళవారం నుంచి తమ కూతురు కనిపించడం లేదని పోలీసులకు బాధిత యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కంప్లైంట్ చేసిన పోలీసులు పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు పట్టించు కుంటే తమ కూతురు దక్కేదని మృతురాలి తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు.

యువతిని కిరాతకంగా హత్య చేసిన దుండగుల కోసం వేట కొనసాగిస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు.

నిందితులను గుర్తించేందుకు బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు.

కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విపత్తుల నుంచి గట్టెక్కేందుకు నేర్చుకున్న విషయాలు, ఉత్తమ ఆచరణ పద్ధతులతో కూడిన గ్లోబల్ డిజిటల్ రిపాజిటరీ ఏర్పాటు యావత్ ప్రపంచానికి ప్రయోజనకరం: ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 9:విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై జరిగిన అంతర్జాతీయ సదస్సు 2025ను ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. యూరప్ లో మొట్టమొదటిసారి జరుగుతున్న ఈ "డిజాస్టర్ రెసిలియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 2025" అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్న ప్రతినిధులకు ఆయన స్వాగతం పలికారు. ఈ సదస్సును నిర్వహించడంలో సహకరించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు శ్రీ ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కు, ఫ్రాన్స్ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరిగే ఐక్యరాజ్యసమితి సముద్రాల సదస్సు సందర్భంగా కూడా ప్రధాని శు భాకాంక్షలు తెలిపారు.

'తీరప్రాంతాలకు సుస్థిర భవిష్యత్తును రూపొందించడం' అనే అంశంపై జరిగిన ఈ సదస్సు ఇతివృత్తాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులకు తీరప్రాంతాలు, దీవులు గురయ్యే ప్రమాదాన్ని శ్రీ మోదీ వివరించారు. భారత్, బంగ్లాదేశ్‌లో రెమల్ తుపాను, తుఫాను, కరేబియన్ లో బెరిల్ హరికేన్, ఆగ్నేయ ఆసియాలో యాగి తుపాను, అమెరికాలో హెలెన్ హరికేన్, ఫిలిప్పీన్స్ లో ఉసాగి తుపాను, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో చిడో తుపాను మొదలైన ఇటీవలి విపత్తులను ఆయన ఉదహరించారు. ఈ విపత్తులు ప్రాణాలకు, ఆస్తులకు గణనీయమైన నష్టాన్ని కలిగించాయని, సుస్థిర మౌలిక సదుపాయాలు, క్రియాశీల విపత్తు నిర్వహణ అవసరాన్ని ఇవి బలపరుస్తున్నాయని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

1999 సూపర్ సైక్లోన్, 2004 సునామితో సహా విధ్వంసం సృష్టించిన విపత్తులతో భారతదేశం భారత్ గత అనుభవాలను గుర్తు చేసిన ప్రధానమంత్రి, భారతదేశం ఎలా త్వరగా అనుసంధానమై, నిబ్బరంతో పునర్నిర్మాణం చేపట్టిందో ప్రధా నమంత్రి ప్రముఖంగా వివరించారు. గాలి తుపాన్లకు అమితంగా ప్రభావితం అయ్యే సైక్లోన్ షెల్టర్లు నిర్మించడం ద్వారా, అలాగే 29 దేశాలకు లాభపడే విధంగా సునామీ హెచ్చరిక వ్యవస్థను ఏర్పాటు చేయడంలో భారతదేశం నిర్వహించిన పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

విపత్తులను తట్టుకునిలబడే గృహాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, ఇంధన వ్యవస్థలు, నీటి వనరుల భద్రతా చర్యలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను నిర్మించడానికి 25 చిన్న ద్వీపాలుగా ఉండి... అభివృద్ధి చెందుతున్న దేశాలతో కలిసి విపత్తు నిరోధక మౌలిక సదుపాయాల కూటమి (సిడిఆర్ఐ) కొనసాగిస్తున్న కృషిని ప్రస్తావిస్తూ, పసిఫిక్ హిందూ మహాసముద్రం, కరేబియన్ ప్రాంతాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొనడాన్ని శ్రీ మోదీ ప్రశంసించారు. సంకీర్ణంలో ఆఫ్రికన్ యూనియన్ భాగస్వామ్యాన్ని కూడా స్వాగతించారు.

అంతర్జాతీయ ప్రాధాన్యతలను వివరిస్తూ, అయిదు ముఖ్యమైన అంశాలను ప్రధానమంత్రి పేర్కొన్నారు. మొదటిది -భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని సిద్ధం చేయడం. రెండోది- విపత్తులను ఎదుర్కొని, దృఢ సంకల్పంతో తిరిగి నిలబడిన దేశాల అనుభవాలను, ఉత్తమ పద్ధతులను డాక్యుమెంట్ చేయడానికి గ్లోబల్ డిజిటల్ రిపాజిటరీని ఏర్పాటు చేయడం. విపత్తు నష్టాల పునరుద్ధరణకు సృజనాత్మక ఆర్థిక సహాయం అవసరమని, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవసరమైన నిధులు మూడో ప్రాధాన్యతగా లభించేలా కార్యాచరణ కార్యక్రమాలను రూపొందించాలని శ్రీ మోదీ పిలుపునిచ్చారు. నాల్గవది, అభివృద్ధి చెందుతున్న చిన్న ద్వీప దేశాలను పెద్ద సముద్ర దేశాలుగా భారతదేశం గుర్తించడాన్ని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. వాటి బలహీనతలపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. అయిదో ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను, సమన్వయాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను, సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం, చివరి మైలు వరకు ప్రభావవంతమైన కమ్యూనికేషన్ ను సులభతరం చేయడంలో వాటి కీలక పాత్రను శ్రీ మోదీ ప్రస్తావించారు. సదస్సులో జరిగే చర్చలు ఈ ముఖ్యమైన అంశాలకు పరిష్కారం చూపుతాయన్న విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు.

కాలానికి, ఆటుపోట్లకు అతీతం గా ప్రకృతి విపత్తులను తట్టుకునే సుస్థిర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. అభివృద్ధిలో దృఢ సంకల్పం కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచానికి బలమైన, విపత్తులను తట్టుకునే భవిష్యత్తును అందించేందుకు సమష్టి ప్రయత్నాలు అవసరమని పిలుపునిస్తూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# ఉగ్రవాదంపై నిర్ణయాత్మక అంతర్జాతీయ చర్య అవసరాన్ని స్పష్టం చేసిన ప్రధాని మోదీ

బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ ఈ రోజు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు.

భారత్– బ్రిటన్ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్ విజయవంతంగా ముగియడం పట్ల ప్రధాని శ్రీ మోదీ ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ముఖ్యమైన మైలురాయికి దారితీసిన రెండు దేశాల నిర్మాణాత్మక కార్యాచరణ తీరును ఆయన అభినందించారు.

ద్వైపాక్షిక సంబంధాల్లో పెరుగు తున్న వేగాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. భారత్–యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. సాంకేతిక భద్రతా చొరవ (టెక్నాలజీ సెక్యూరిటీ ఇనిషియేటివ్) కింద కొనసాగుతున్న సహకారాన్ని స్వాగతించడంతోపాటు, నమ్మకమైన సురక్షితమైన ఆవిష్కరణ వ్యవస్థల ఏర్పాటుపై దాని సామర్థ్యాన్ని గురించి ఆయన ప్రస్తావించారు.

వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, టెక్నాలజీ, ఇన్నోవేషన్, క్లీన్ ఎనర్జీ వంటి కీలక రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకోవడంపై బ్రిటన్ ఆసక్తిని డేవిడ్ లామీ తెలియజేశారు. ఎఫ్టీఏ రెండు దేశాలకు కొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు

ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించిన యూకే విదేశాంగ మంత్రి – సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఉగ్రవాదం, దానికి మద్దతిచ్చే వారిపై నిర్ణయాత్మక అంతర్జాతీయ చర్య తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

బ్రిటన్ ప్రధానమంత్రి సర్ కీర్ స్టార్మర్ కు తన శుభాకాంక్షలు అందచేయాలని, ఇద్దరికీ సమయం కుదిరేలా వీలైనంత త్వరగా భారత్ లో పర్యటించాలని కోరుతున్నట్టు తెలియచేయాలని డేవిడ్ లామీని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కోరారు.

# చదువే భవిష్యత్తు.. పెట్టుబడి : హోంమంత్రి అనిత



విజయనగరం, జూన్ 9: పిల్లలకు చదువే భవిష్యత్తు అని, అలాగే పెట్టుబడి కూడా అని రాష్ట్ర హోంశాఖ మంత్రి, విజయనగరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం విజయనగరం వై జంక్షన్ వద్ద ఉన్న ఓ కన్వెషన్‌లో జరిగిన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు అవార్డులు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు విద్య విలువ నేర్పుతుందని చెప్పారు.

తల్లిదండ్రుల త్యాగాలు మరువరాదు..

పిల్లల కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తారని, తల్లిదండ్రులు త్యాగాలను పిల్లలు మరువరాదని మంత్రి అనిత అన్నారు.

పిల్లల విజయం వెనుక తల్లిదండ్రుల కృషి ఎంతో ఉంటుందని చెప్పారు. ప్రతి విద్యార్థి లక్ష్యం దిశగా ముందుకు వెళ్లాలన్నారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కోరారు.

# అలియాబాద్ రెవెన్యూ సదస్సులో 37 దరఖాస్తులు : డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త



హైదరాబాద్, జూన్ 9:ప్రజలు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్లు వెంకట నర్సింహారెడ్డి, యాదగిరిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త అన్నారు.

ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని మూడు చింతలపల్లి, శామీర్‌పేట రెవెన్యూ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించి ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అలియాబాద్‌లో నిర్వహించిన సదస్సులో 37 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ కంటం కృష్ణారెడ్డి, మాజీ వార్డు సభ్యులు బండి రాంరెడ్డి, సంజీవరెడ్డి, మల్లేష్‌యాదవ్, వెంకటేశ్, తంటం రాము, శ్రీకర్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ జీవుల స్వేదమే దేశానికి నిజమైన సంపద - పవన్ కళ్యాణ్



అమరావతి, జూన్ 9: శ్రమ జీవుల స్వేదమే దేశానికి నిజమైన సంపద. వారి అభ్యున్నతి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రాణాలు పణంగాపెట్టి పని చేసే ఎలక్ట్రీషియన్లకు రక్షణ, భద్రత చాలా ముఖ్యమని అన్నారు.

నిరుద్యోగ యువత కోసం పిఠాపురం నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకోసారి జాబ్ మేళా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మంగళగిరి క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజక వర్గవ్యాప్తంగా ఉన్న 325 మంది ప్రైవేటు ఎలక్ట్రీషియన్లతో సమావేశమ య్యారు. పని ప్రదేశాల్లో వారి రక్షణ, భద్రత కోసం సేఫ్టీ కిట్లను అంద జేశారు. ఈ సేఫ్టీ కిట్ లో ఎలక్ట్రికల్ పనులకు అవసరమైన టూల్ కిట్, రబ్బర్ హాండ్ గ్లోవ్స్, షూస్, జాకెట్ ఉన్నాయి.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడు తూ.. "గత ఏప్రిల్ నెలలో పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో ఎలక్ట్రీషియన్ గా పని చేసే దళిత యువకుడు వల్లపు సురేష్ ప్రమాదవశాత్తు మరణించడం చాలా కలచి వేసింది. ఒకరి ఇంట్లో విద్యుత్ మరమ్మత్తు పనులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై సురేష్ మరణించారు. ఆయన మరణంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి నిరాధారంగా మారింది. ఒక వైపు ప్రాణం కోల్పోయి ఆ కుటుంబం దుఃఖములో ఉంటే.. మరోవైపు గ్రామంలో అనేక స్పర్ధలకు దారి తీసింది. రాజకీయ లబ్ధి కోసం ఆలోచించే వారు ఇలాంటి గొడవల ను పెంచి పెద్దవిగా చేస్తారు. మేం మాత్రం ఇలాంటి సమస్యలను ఎలా పరిష్కరించాలి అని ఆలోచన చేస్తాము.

రక్షణ, భద్రత కల్పించాలని నిర్ణయం తీసుకున్నాం ప్రాణాలు పణంగా పెట్టి పనిచేసే వారికి రక్షణ, భద్రత కల్పించాలని వ్యక్తిగతంగా కోరుకునేవాడిని. సురేష్ మరణం వెనుకనున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే రెండు అంశాలు స్పష్టమ య్యాయి. ఒకటి ఆయన పేదరికం. విద్యుత్ పనులు చేసేటప్పుడు వాడే రక్షణ పరికరాలు ఆయన దగ్గర లేకపోవడంతో మరణించారు. రెండవది ప్రమాదవశాత్తు ఆయన చనిపోతే అతని కుటుంబానికి ఆదుకునేందుకు సరైన ఆర్థిక భద్రత లేకపోవడం. ఇటువంటి సంఘటన మళ్లీ పునరావృతం కాకూడదనే నిశ్చయంతో పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న 325 మంది ప్రైవేటు ఎలక్ట్రీషియన్లకు రక్షణ పరికరాల కిట్లను అందజేస్తున్నాము. విద్యుత్ సంబంధిత పనులు చేసేటప్పుడు ఈ రక్షణ పరికరాలను తప్పనిసరిగా వాడాలని ఎలక్ట్రీషియన్లను కోరుతున్నాను.

పని ప్రదేశంలో విద్యుత్ షాక్ తో మరొకరు చనిపోకూడదు.రక్షణ ఏర్పాట్లు చేసినా ప్రాణం కోల్పోయే ప్రమాదం ఉంటే కేంద్ర కార్మిక, ఉ పాధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన ద్వారా రూ.2 లక్షలు, చంద్రన్న బీమా ద్వారా మరో రూ. 2 లక్షలు అందించే ఏర్పాట్లు చేశాం. గత ప్రభుత్వనీ వ్యవస్థలను అస్తవ్యస్తంగా మార్చేసింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని దారి మళ్లించింది. వ్యవస్థలను గాడిలో పెట్టడంతోపాటు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామ"న్నారు.

పదేళ్ల నుంచి ఉన్న జీవోను సవరించారు: శ్రీ కృష్ణతేజ

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ మాట్లాడుతూ "మూడు నెలల క్రిందట ఆటో ఢీకొని ముగ్గురు ఉ పాధి శ్రామికులు మరణించారు. వారికి ప్రభుత్వ జీవో ప్రకారం చెరో రూ.50 వేలు పరిహారం అందించాం. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ పదేళ్లుగా కొనసాగుతున్న జీవోను సవరించి బాధిత కుటుంబాలకు రూ. 2 లక్షలు పరిహారం అందేలా చేశారు. అలాగే రూ. 2 లక్షలు సరిపోవని భావించిన పవన్ కళ్యాణ్ గారు? వారం రోజులపాటు ఒక డ్రైవ్ లా కోటి మంది ఉపాధి శ్రామికులకు ఇన్సూరెన్స్ చేయించారు. భవిష్యత్తులో ఉపాధి శ్రామికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.4 లక్షలు పరిహారం అందేలా ఏర్పాట్లు చేశారు.

పిఠాపురం నియోజకవర్గంలో సురేష్ అనే ఎలక్ట్రీషియన్ ప్రమాదవశాత్తు మరణిస్తే.. ఇలాంటి మరణాలు మళ్లీ సంభవించకూడదని నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు సేఫ్టీ కిట్లు పంపిణీ చేశారు. అలాగే వారికి రూ. 4 లక్షల పరిహారం అందేలా ఏర్పాట్లు చేస్తున్నార"న్నారు.

కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ మాట్లాడుతూ "భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కార్మికులకు ప్రైవేటు ఇన్సురెన్స్ లేకపోయినా ఈ బోర్డు నుంచి పరిహారం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. అలాగే ఈ రంగం లో పని చేసే యువతకు ప్రత్యేకంగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తామ"న్నారు.

# గడచిన 11 ఏళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని పునర్నిర్వచించింది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 9:అభివృద్ధి చెందిన భారత్ దిశగా సాగుతున్న ప్రయాణంలో మహిళలు మార్పుతో కూడిన పాత్రను పోషిస్తున్నారని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. మహిళల నాయకత్వంలో అభివృద్ధికి గత 11 సంవత్సరాలుగా తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు.

మన తల్లులు, సోదరీమణులు, కూతుళ్లు అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలను చూశారని ప్రధాని అన్నారు. కానీ నేడు వారు అభివృద్ధి చెందిన భారతదేశ సంకల్ప సాధన దిశలో చురుకుగా పాల్గొనడమే కాకుండా, విద్య నుంచి వ్యాపారం వరకు ప్రతి రంగంలో ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రధాని అన్నారు. . గడచిన 11 ఏళ్లలో మహిళా శక్తి సాధించిన విజయాలు పౌరులందరికీ గర్వకారణమని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వం అనేక ప్రభావవంతమైన కార్యక్రమాల ద్వారా మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని పునర్నిర్వచించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా గౌరవాన్ని అందించడం, జన్ ధన్ ఖాతాల ద్వారా ఆర్థిక సమ్మిళితం, క్షేత్రస్థాయిలో సాధికారత వంటివి ఇందులో ఉన్నాయి.

ఉజ్వల యోజనను అనేక గృహాలకు పొగ రహిత వంటగదులను తీసుకువచ్చిన మైలురాయిగా ఆయన అభివర్ణించారు. ముద్రా రుణాలు లక్షలాది మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి, వారి కలలను స్వతంత్రంగా కొనసాగించడానికి ఎలా దోహదపడ్డాయో ఆయన వివరించారు. పీఎం ఆవాస్ యోజన కింద మహిళల పేరిట ఇళ్లు ఇవ్వడం కూడా వారి భద్రత, సాధికారతపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది.

బేటీ బచావో బేటీ పఢావో ప్రచారాన్ని కూడా ప్రధాని గుర్తు చేస్తూ, వాటిని ఆడపిల్లల రక్షణ కోసం చేపట్టిన జాతీయ ఉద్యమంగా అభివర్ణించారు.

సైన్స్, విద్య, క్రీడలు, స్టార్టప్స్, సాయుధ దళాలు సహా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారని శ్రీ మోదీ అన్నారు.

సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా వరస పోస్టుల్లో ప్రధానమంత్రి ఈ వ్యాఖ్యలు పంచుకున్నారు.

"అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కొన్న రోజులను మన తల్లులు, సోదరీమణులు, కూతుళ్లు చూశారు. కానీ నేడు వారు అభివృద్ధి చెందిన భారతదేశ సంకల్పంలో చురుకుగా పాల్గొనడమే కాకుండా, విద్య, వ్యాపారం వరకు ప్రతి రంగంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. గత 11 ఏళ్లలో మన నారీ శక్తి సాధించిన విజయాలు మన దేశ ప్రజలను గర్వపడేలా చేస్తాయి"

స్వచ్ఛభారత్ ద్వారా గౌరవాన్ని నిలబెట్టడం నుంచి జన్ ధన్ ఖాతాల ద్వారా ఆర్థిక సమ్మిళితం వరకు వివిధ కార్యక్రమాలు మన మహిళా శక్తి సాధికారతపై దృష్టి సారించాయి. ఉజ్వల యోజన అనేక గృహాలకు పొగ రహిత వంటగదులను తీసుకువచ్చింది. ముద్రా రుణాలు లక్షలాది మంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సొంత కలలను సాకారం చేసుకునేందుకు దోహదపడ్డాయి. పీఎం ఆవాస్ యోజనలో మహిళల పేరుతో ఉన్న ఇళ్లు కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపాయి.బేటీ బచావో బేటీ పఢావో ఆడపిల్లల రక్షణ దిశగా క జాతీయ స్థాయిలో స్ఫూర్తిని రగిలించింది.

సైన్స్, విద్య, క్రీడలు, స్టార్టప్స్, సాయుధ దళాలు సహా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# భగవాన్ బిర్సా ముండాకు ప్రధానమంత్రి నివాళి

న్యూఢిల్లీ, జూన్ 9:స్వాతంత్ర్య సంగ్రామంలో మహానాయకుడు భగవాన్ బిర్సా ముండా జీ అమరుడైన రోజు ఈ రోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు నివాళులు అర్పించారు.

భగవాన్ బిర్సా ముండా తన జీవనాన్ని గిరిజన సోదరులు, సోదరీమణుల సంక్షేమం కోసం, వారి హక్కుల రక్షణ కోసం అంకితం చేశారని ప్రధానమంత్రి అన్నారు. ఆయన త్యాగం, భక్తి దేశ ప్రజలకు సదా ప్రేరణనిస్తూ ఉంటాయని కూడా ప్రధానమంత్రి అన్నారు.

" స్వాతంత్ర్య సంగ్రామంలో మహానాయకుడు భగవాన్ బిర్సా ముండా జీకి ఆయన బలిదాన దినోత్సవం సందర్భంగా గౌరవపూర్వక శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

ఆదివాసీ సోదరులు, సోదరీమణుల సంక్షేమం కోసం, వారి హక్కుల రక్షణ కోసం ఆయన తన జీవనాన్ని అంకితం చేశారు. ఆయన త్యాగం, భక్తి దేశ ప్రజలకు సదా ప్రేరణనిస్తూ ఉంటాయి."

# పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలి

మహబూబ్‌నగర్, జూన్ 9:పంచాయతీ కార్యదర్శులకు పని భారాన్ని తగ్గించాలని ఆ సంఘం నాయకులు రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పంచాయతీ సెక్రెటరీ సోనాలి, ఇతర కారణాల వల్ల మృతి చెందిన పంచాయతీ కార్యదర్శుల చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులర్పించారు.

ఆయన మాట్లాడుతూ గ్రామపం చాయతీ నిర్వహణ కోసం ప్రతినెల నిధులు విడుదల చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఉ న్నతాధికారులు జారీచేసిన షోకాజ్ నోటీసులు, మెమోలను వెంటనే ఉ పసంహరించుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులకు సీనియార్టి ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, పంచాయతీలకు పాలకవర్గం లేకపోవడంతో ప్రజలు, కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో భూపతి, సురేష్, రమేష్, లింగారెడ్డి తదితరులున్నారు.

# వ్యవసాయ పొలం నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

వరంగల్, జూన్ 9:నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలో విషాదం చోటు చేసుకుంది. వ్యవసాయ పొలంలో ఏర్పాటుచేసిన కవర్ గుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన లో కుంభం ధరణి, సుధాకర్ యాదవ్ దంపతులు వ్యవసాయపొలంలో కవర్‌తో నీటి గుంటను నిర్మించుకున్నారు.

వర్షాలు కురుస్తుండడంతో పొలంలో పత్తి విత్తనాలు నాటేందుకు వారి వెంట కుమారులు అశ్విత్ కుమార్ (8),చేతన్ (6) సోమవారం తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పత్తి విత్తనాలు నాటుతుండగా పిల్లలిద్దరూ ఆడుకుంటూ కవర్ గుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మరణించారు. దీనిని గమనించని తల్లిదండ్రులు తమ పిల్లలు కనిపించడం లేదని పరిసర ప్రాంతాల్లో గాలించారు. చివరకు సొంత పొలంలోనే నీటి గుంటలో విగత జీవులుగా పడి ఉండడాన్ని చూసి బోరున విలపించారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాలను ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ రాత్లావత్ బొడ్కా నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

